మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 227 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





# స్కిల్స్ యూనివర్సిటీ ప్రక్రియలో మరో ముందడుగు

**- నిర్మాణానికి ముందుకు వచ్చిన మెగా కంపెనీ**

**- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ**

**- కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ రూ. 200 కోట్లు కేటాయింపు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మరో ముందడుగు పడింది. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్

మిగతా 2లో..

## మెట్రోవిస్తరణకు కేబినెట్ పచ్చజెండా



వార్తా 2లో..



# క్రమశిక్షణగల ఫోర్స్‌లో ఉండి ఆందోళనలు సరికాదు

**పోలీసు కుటుంబాల నిరసనలపై డిజిపి సీరియస్**

**ఘటనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు : డిజిపి**

వరంగల్ బ్యూరో (ప్రజా మంటలు):
ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు నిరసనలకు దిగారు. నిన్నామొన్నటిదాకా వారి కుటుంబ సభ్యులు మాత్రమే నిరసనలు చేపట్టగా.. శనివారం రోజున యూనిఫాం వేసుకుని పోలీసులే రోడ్డెక్కారు. తాము వెట్టి చాకిరీ చేయలేమని, ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ అమలు చేయాలంటూ వరంగల్ నగరంలోని మామునూర్ నాల్గవ డీజీఎస్పి బెటాలియన్ పోలీసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బెటాలియన్ ఆవరణలో గేటు వద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్ లో మొత్తం 1200 మంది పోలీసులు ఉండగా 220 మంది ఆర్ఎస్ఐ, హెచ్‌సి, పిసిలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న తీరుగా తెలంగాణలో కూడా ఒకే పద్ధతిలో డ్యూటీలు, స్వేచ్ఛ ఉండాలని అన్నారు. తాము నెలల తరబడి డ్యూటీ మీద పోయి తమ కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నెలలో నాలుగు రోజులు మాత్రమే సెలవులు ఇవ్వడం వల్ల తమకు ఎలాంటి ప్రయోజన కలగడం లేదని అన్నారు.ఏ జిల్లా బెటాలియన్ పోలీసులు ఆ జిల్లా సిపి, ఎస్పీలకు అటాచ్ చేస్తూ ఆ జిల్లాలోనే

మిగతా 2లో..

# ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం ప్రత్యేక యాప్

**- దీని ద్వారా అర్హులను ఎంపిక చేస్తాం**

**- మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పరిశీలించారు. ఈ యాప్‌లో ఒకటి రెండు మార్పు చేర్పులను మంత్రి సూచించారు. ఆయన సూచనల మేరకు మార్పులు చేసి వచ్చే వారంలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తాం. ఇందుకు చేయాల్సిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా చూడాలని సూచించా. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల కేటాయింపు వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతవరకు వినియోగించుకోవాలి. పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు.



# పోరాటాలు నాకు కొత్తకాదు

**• ప్రియాంకగాంధీ వాద్రా**



న్యూఢిల్లీ(జనంసాక్షి):
ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి అరంగేట్రం చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీవయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ఈ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈనేపథ్యంలో తాజాగా వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఓ భావోద్వేగభరిత పోస్ట్ చేశారు. ఎన్నికల్లో పోటీ కొత్తేమో గానీ.. ప్రజల తరపున పోరాటం తనకు కొత్తేమీ కాదని అన్నారు. "కొన్ని నెలల క్రితం నేను, మా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై, చూరాల్‌మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపించిన అచంచలమైన ధైర్య సాహసాలే.. ఈరోజు నాలో స్ఫూర్తిని నింపాయి. మీ తరపున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా" "నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరపున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు.

మిగతా 2లో..

# పద్మశ్రీ గుస్సాడీ గురువు కనకరాజు మృతి

**- సంతాపం తెలిపిన ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణకు సీఎం ఆదేశం**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
గుస్సాడీ నృత్యాన్ని విస్తృత పరిచిన 94ఏళ్ల పద్మశ్రీ కనకరాజు కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. గిరిజన బిడ్డల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడీ నృత్యంతో కనకరాజు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సొంతూరు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామం. ఆయన గత కొంత కాలంగా అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అనేక ఆసుపత్రుల్లో చూపించిన ప్రయోజనం లేకపోయింది. గుస్సాడీ నృత్యాన్ని కాపాడుతూ వచ్చిన వ్యక్తిగా పేరు ఉన్న కనకరాజుకు కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రకటించింది. అప్పటి రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును

మిగతా 2లో..

## ప్రజా నాడి




# కేసీఆర్ అవినీతి మీద చర్యలు!

**- కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం**

**- అన్నికేసులపైనా విచారణ సాగుతున్నాయి**

**- కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంది**

**- కేబినెట్ విస్తరణ అధిష్టానం, సీఎం చూసుకుంటుంది**

**- త్వరలోనే పార్టీ పునర్వ్యవస్థీకరణ చేపడతాం**

**- మీడియాతో ఇష్టాగోష్ఠిలో**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని ప్రపంచానికంతా తెలిసిందని, అందుకే కెసిఆర్ కుటుంబ అవినీతిపై చర్యలకు సర్వత్రా డిమాండ్ పెరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అవినీతి పరులను ప్రభుత్వం వదలబోదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమిషన్ల కోసం కాళేశ్వరం కట్టారని.. ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరపుతోందని.. కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని.. అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. శనివారం మీడియా ప్రతినిధులతో ఇష్టగోష్టిగా మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ ఏఐసీసీ, ముఖ్యమంత్రి కనుసన్నలలో జరుగుతుందని.. తాను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. త్వరలో పీసీసీ నూతన కార్యవర్గ నియామకం



ఉంటుందని.. డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందని అన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని.. పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని అన్నారు. జీవన్ రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్తాపానికి లోనయ్యారని.. బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని.. ఆయనకు పార్టీ

మిగతా 2లో..

## పొలిట్రిక్స్

**ఇరుపక్షాల నడుమ బాంబుల గొడవలు, రాష్ట్రంలో వేడెక్కిన రాజకీయ తంత్రాలు ! దీపావళి పటాకుల సంబరాలు ఒకవైపు, మాజీల అరెస్టుల మంతనాలు మరోవైపు !**

- న్యాలకంటి నారాయణ
9346200066

మొదటి పేజీ తరువాయి

## పోరాటాలు నాకు కొత్తకాదు

**• ప్రియాంకగాంధీ వాద్రా**

ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తున్నా" అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్‌గాంధీ.. సీపీఐ నాయకురాలు అన్నీరాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాహుల్ రాజీనామాతో జరుగుతోన్న ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## పద్మశ్రీ గుస్సాడీ గురువు కనకరాజు మృతి

నవంబర్ 9న అందుకున్నారు. వందల మంది యువకులు ఆయన వద్ద గుస్సాడీ నృత్యం నేర్చుకొని శిష్యులుగా మారారు. గిరిజన బిడ్డలకు ఎంతో ఇష్టమైన గుస్సాడీ నృత్యానికి వన్నె తేవడమే కాకుండా పద్మశ్రీ అందుకొని తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచిన కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు చేస్తామని ప్రకటించారు. గుస్సాడీ కళాకారుడు కనకరాజు మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారిక లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కనకరాజు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. గుస్సాడీ నృత్యం కోసం ఆయన చేసిన సేవలు మరవలేనివన్నారు. కనకరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మెట్రోవిస్తరణకు కేబినెట్ పచ్చజెండా

- **రెవెన్యూ డివిజన్‌గా ఏటూరునాగారం**
- **ఉద్యోగుల 2 డీఏలకు ఆమోదం**
- **రేరాలో 54 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీకి ఆదేశాలు**
- **రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ దగ్గర రూ.7వేల కోట్ల అప్పు కోసం అనుమతిపై చర్చ**
- **సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు**
- **తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు**
- **వివిధ అంశాలపై చర్చించిన మంత్రివర్గం**

హైదరాబాద్, (ప్రజా మంటలు):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది ముఖ్యంగా మూసీ పునరుజ్జీవ చర్యలు, హైడ్రా, 317 జీవో, ఉద్యోగుల డీఏలు, ధాన్యం కొనుగోళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించారు. అలాగే పలు ముఖ్య అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది. రేరాలో 54 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీకి ఆదేశాలు ఇస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ దగ్గర 7వేల పై చిలుకు కోట్ల అప్పు కోసం కేబినెట్ అనుమతిపై చర్చిం చారు. కేంద్ర సంస్థల దగ్గర రూ.30వేల కోట్లు రుణాలు తీసుకోవడం కోసం..రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని రోడ్లు తనఖా పెట్టడానికై కేబినెట్‌లో చర్చజరిగింది. ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయింపుపై చర్చ జరిగింది. ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. ఈ క్రమంలోనే ములుగులో సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## స్కిల్స్ యూనివర్సిటీ ప్రక్రియలో మరో ముందడుగు

లిమిటెడ్ ముందుకొచ్చింది. యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లను మేఘా కంపెనీ కేటాయించింది. యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను మేఘా కంపెనీ స్వీకరించింది. ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులతో స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు మేఘా కంపెనీ ముందుకొచ్చింది. సచివాలయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి కంపెనీ ప్రతినిధుల బృందం చర్చలు జరిపారు. సీఎంతో పాటు చర్చల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ప్రభుత్వం తలపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునేందుకు మేఘా కంపెనీ నిర్వాహకులు చర్చలు జరిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణం చేపడుతామని మేఘా కంపెనీ ప్రకటించింది. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) మేఘా కంపెనీ చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. హైదరాబాద్ శివార్లలో కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. అధునాతన బోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని వసతులుండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎస్ఆర్ నిధులతో ఈ క్యాంపస్ నిర్మాణానికి మేఘా కంపెనీ ముందుకు వచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అకాడమిక్ బిల్డింగ్, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ బిల్డింగ్ నిర్మిస్తామని మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్‌లతో నిపుణులతో తయారు చేయించిన డిజైన్‌లపై చర్చించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నవంబర్ 8వ తేదీ నుంచి యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించ డానికి ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం రేవంత్‌రడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## మహారాష్ట్ర,జార్ఖండ్‌ఎన్నికలకు దూరం

### ఆప్ అధినేత కేజ్రీవాల్ నిర్ణయం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైన ఆమ్ ఆద్మీ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించిందని ఆ పార్టీ నేత సంజయ్ సింగ్ తెలిపారు. మహా వికాస్ అఘాఢీ కూటమిలోని పార్టీలకు మద్దతుగా తమ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మహారాష్ట్రతో పాటు ఝార్ఖండ్ విషయంలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హేమంత్ సోరెన్‌కు మద్దతుగా ఝార్ఖండ్ ముక్తి మోర్చాకు కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరనుండగా.. ఝార్ఖండ్‌లో 13, 20 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. 23న ఫలితాలు వెలువడనున్నాయి. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి పోటీగా విపక్ష పార్టీలన్నీ ఇండియా కూటమి స్థాపించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేసింది. ఒక్క పంజాబ్‌లో మాత్రం ఒంటరిగా బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం సొంతంగా పోటీ చేసి ఖాతా తెరవడంలో విఫలమైంది. తాజాగా మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా నిలిచింది.



క్రమశిక్షణగల ఫోర్స్‌లో ఉండి

## ఆందోళనలు సరికాదు

పోలీసు కుటుంబాల నిరసనలపై డిజిపి సీరియస్

ఘటనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు : డిజిపి

విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకొని తమకు న్యాయం చేయాలని టిజిఎస్పి పోలీసులు కోరారు. అనంతరం ధర్నా విరమించి డ్యూటీలోకి వెళ్ళిపోయారు. అదేవిధంగా బెటాలియన్ వ్యవస్థలో పటీక్ పేరుతో చేసే వెట్టిచాకిరి నశించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సాగర్ రోడ్డుపై పోలీస్ బెటాలియన్ కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. బ్రిటిష్ కాలం నాటి విధి విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు. మా భర్తలకు డ్యూటీలు వేసి మాకు, మా సంసారాన్ని కుటుంబాన్ని దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ బెటాలియన్‌లో పనిచేస్తున్న స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ కుటుంబాలు తమ చిన్న పిల్లలతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి పైన రాస్తారోకో చేసి ఫ్లెక్సీలతో తమకు న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళాలతో పాటు కొంతమంది స్పెషల్ పోలీసులు సైతం ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంచిర్యాల ఏసిపి ప్రకాష్, సిఐ ప్రమోద్ కుమార్ నచ్చజెప్పి నిరసనను విరమింప చేసి ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఓవర్ బ్రిడ్జిపైన ఆందోళన కార్యక్రమంతో ఇరువైపులా కిలోమీటర్ పొడవునా వాహనాలు నిలిచిపోయాయి.

ఇది క్రమశిక్షణా ఉల్లంఘన : డిజిపి

రాష్ట్ర డిజిపి జితేందర్ ప్రకటన విడుదల

తెలంగాణ పోలీస్ బెటాలియన్లలో పనిచేసే కానిస్టేబుల్స్ చేస్తున్న ఆందోళనల పైన పోలీస్ శాఖ గుర్రుగా ఉంది. విధులను బహిష్కరించటం, రోడ్ల పైకి వచ్చి ఖాకీలే ఆందోళన చేయడం తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనగా పోలీస్ శాఖ భావిస్తోంది. ఈ పరిణామాన్ని ఏమాత్రం లైట్ తీసుకోకూడదని పోలీసు శాఖ నిర్ణయించింది. పోలీసు శాఖలో పనిచేస్తూ జన జీవనానికి ఇబ్బంది కలిగేలా రోడ్లపై వచ్చి ఆందోళన చేస్తున్న పోలీసులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైనట్లు సమాచారం. పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు సెలవుల విషయంలో పాత పద్ధతిని అనుసరిస్తామని ఇప్పటికే చెప్పినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఆందోళన చేస్తున్నారని పోలీస్ శాఖ ఆగ్రహంగా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై తీవ్రమైన చర్యలకు పోలీస్ శాఖ సిద్ధమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా నిరసనలకు దిగిన కొంతమందిని పోలీస్ శాఖ ఇప్పటికే గుర్తించింది. కానిస్టేబుళ్ల ఆందోళన వెనుక ప్రభుత్వం అంటే గిట్టని కొన్ని రాజకీయ శక్తుల హస్తముందని పోలీస్ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలో బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ తీవ్రంగా స్పందించారు. క్రమక్షశిణతో కూడిన ఫోర్స్‌లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాదన్నారు. ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెలవులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాదన్నారు. ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉన్నాయనే అనుమానం ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మన దగ్గర ఉన్న రిక్రూట్‌మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ బెటాలియన్ పోలీసుల ఆందోళనలపై పోలీసు శాఖ సీరియస్ అయింది. విధులు బహిష్కరించి రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయడం క్రమశిక్షణ ఉల్లంఘనగా భావిస్తున్నట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లో కూడా సహించబోమని, ఆందోళన చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. సెలవుల విషయంలో పాత పద్ధతినే అనుసరిస్తామని చెప్తున్నా మళ్లీ ఆందోళనలు చేపట్టడం సరికాదన్నారు. బెటాలియన్ పోలీసుల వెనుక కొంతమంది ప్రభుత్వ వ్యతిరేక శక్తుల హస్తముందని అనుమానాలు కూడా వస్తున్నాయన్నారు. తెలంగాణలో ఉన్న రిక్రూట్‌మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ఈ సందర్భంగా డిజిపి పేర్కొన్నారు.

## కేసీఆర్ అవినీతి మీద చర్యలు!

అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ.. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండా సురేఖ మాటలను పార్టీ పరంగా సమర్థించమన్నారు. వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించు కున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్ నెలలో కొన్ని శుభవార్తలు వింటారని మహేష్ గౌడ్ అన్నారు. మరోవైపు.. 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని.. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుందని తెలిపారు. బీసీ విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొంత డివియేట్ అవుతున్నారని.. ఆయనతో నేను, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ దీపదాస్ మున్సి మాట్లాడామని.. అన్ని సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామని.. ఆ సమావేశానికి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను ఆహ్వానించామని తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని కుమార్ గౌడ్ అన్నారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళు కాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని అన్నారు. అలాగే విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే విద్యుత్ దొరుకుతుందని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన లేదని అన్నారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమకు లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ తెలంగాణపై అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో విడుతాల వారిగా చేసిన దానికంటే తాము రుణమాఫీ చేసిన మొత్తం ఎక్కువేనని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన లేదని చెప్పారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని చెప్పారు. సోషల్ మీడియాలో అనైతికంగా ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతూ పట్టుకుందమంటే పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టామని వివరించారు. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయని అన్నారు. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరుగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు. జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదన్నారు. నెలలు అవుతుంది, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయాడు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్‌కు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ఆయన చేస్తున్నది ఏంటని అన్నారు. సీఎం తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇల్లును కూల్చామనే చెప్పారు, కానీ కోర్టు డైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్ధాంతంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు, అంతే తప్ప భవిష్యత్ తరాలకోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన అని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రభావం ఉండదు. బీఆర్ఎస్‌లో ఏముందని చేరతారు. కేసీఆర్ కనబడటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్ పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టలు వర్తిస్తాయి. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని కొందరు చెప్పుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయి. కేటీఆర్‌తో సన్నిహితంగా ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

భారత రాజ్యాంగ స్వీకరణ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక ఉమ్మడి సమావేశం జరిగే అవకాశం ఉందని శనివారం అధికారులు వెల్లడించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ రజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26న అది అమలులోకి వచ్చింది. సంవిధాన్ సభకు చెందిన సెంట్రల్ హాలులో లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశం నవంబర్ 26న జరిగే అవకాశం ఉంది. నవంబర్ 26వ తేదీని ఇదివరకు జాతీయ న్యాయ దినోత్సవంగా పాటించేవారు. రాజ్యాంగ విలువల గురించి ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

## ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతు

ఆసిపాబాద్,అక్టోబర్26 (ప్రజా మంటలు):

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత నదిలో ముగ్గురు గల్లంతయ్యారు. బెజ్జూరు మండలం గోల్కొండ గ్రామానికి చెందిన జహీర్ హుస్సేన్ (24), ఇర్షాద్ (20), మోసిద్ (22), కాజీమ్ అనే యువకులు శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో బంద్ ఉండటంతో సరదాగా బెజ్జూర్ మండలం ఎర్రబండ రేవు వద్ద ప్రాణహిత నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో బెజ్జూర్ ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. యువకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.


## ఫిబ్రవరి 12నుంచి మేడారం మినీ జాతర

ములుగు,అక్టోబర్26 (ప్రజా మంటలు):

దక్షిణభారత కుంభమేళాగా ఖ్యాతిగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మల మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజులపాటు ఈ మినీ జాతర జరగనుంది. రెండేళ్లకోసారి మేడారం మహా జాతర జరుగుతుండగా.. అధిక సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. వనంలో కొలువైన వనదేవతలు జనం మధ్యకు రావడంతో అడవి అంతా జనసంద్రమవుతుంది. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇవాళ సమావేశమైన పూజారులు.. మినీ జాతర తేదీలను ప్రకటించారు.

## సిఎం సోదరులు దండుపాళ్యం బ్యాచ్: కెటిఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు తెలంగాణ పాలిట దండుపాళ్యం ముఠాలా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. న్యాయవాది భూములకే సీఎం సోదరులు ఎసరు పెట్టినట్లు వార్తలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. బాధిత వ్యక్తి న్యాయం కోసం పోలీసుల వద్దకు వెళ్తే.. సీఎం సోదరులతో సెటిల్ చేసుకోమని చెబుతారా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నది పోలీసులా రేవంత్ ప్రైవేట్ సైన్యమా న్యాయవాదికే న్యాయం దక్కకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్రంలో ఉన్న సోదరులకు తెలంగాణ ఆస్తులను దోచి పెడుతూ.. మరోవైపు అమెరికాలో తమ్ముడి కంపెనీతో 1000 కోట్ల ఒప్పందంతో ఏం సందేశం ఇస్తున్నట్లు..అని నిలదీశారు. రాకేష్ రెడ్డి తండ్రి సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో పని చేసినందుకు మీరు ఆ కుటుంబానికి ఇచ్చిన బహుమానం ఇదేనా.. అని కేటీఆర్ అడిగారు.

# కొడంగల్ నుంచే రేవంత్ పతనం

### కాంగ్రెస్ నేతలు పలువురు బిఆర్ఎస్‌లో చేరిక

### తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ఇలాఖాలో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం పర్యటనలో ఉండగానే.. సొంత పార్టీకి చెందిన పలువురు నేతలు సీఎంకు షాకిచ్చారు. పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే కాంగ్రెస్ సర్కారుపై తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డితోపాటు.. బీఎస్పీ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన నర్మద బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దాదాపు వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు కూడా కారెక్కారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ మాజీ ఎంపీపీ, బీఎస్పీ కాంటెస్టెడ్ క్యాండిడేట్ నర్మదా, పలువురు కాంగ్రెస్ నాయకులు కారెక్కారు. వీరందరికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించే దిశగా పని చేస్తామని నేతలు పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేశారని వారు ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిం చారని, అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం





సిద్ధం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొడంగల్ నియోజక వర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికను పక్కన పెట్టారని.. కేవలం కమిషన్ల కోసం కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును చేపట్టారని ఆరోపించారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు పలు వర్గాల ఆందోళనలు, ధర్నాలతో తెలంగాణ అట్టుడుకుతోందని, మంత్రులు మాత్రం విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని మండిపడ్డారు.

చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల ప్రగతిపథంలో పరుగులు పెట్టిన తెలంగాణ రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని, కాంగ్రెస్ నేతల ఆదాయం మాత్రం పెరుగుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తరిస్తోందని, ఇది అధికార దుర్వినియోగం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కలిసికట్టుగా పనిచేసి కొడంగల్‌లో కాంగ్రెస్‌ను ఓడించాలని నేతలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కొడంగల్‌లోనే ఫార్మా కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేయడంతో స్థానిక ప్రజలు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొడంగల్ నియోజకవర్గాన్ని తక్కువ ఖర్చుతో సస్యశ్యామలం చేసే ప్రణాళికలు పక్కనపెట్టి, కేవలం కమిషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టారని మండిపడ్డారు. మొన్నటిదాకా రేవంత్ రెడ్డి తిట్టిపోసిన మెగా ఇంజనీరింగ్ కంపెనీకి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టడం వెనక ఉన్న మతలబు ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. ధర్నాలు, రాస్తారోకోలతో తెలంగాణ అట్టడుకుతుంటే? మంత్రులు విహార యాత్రల్లో ఎంజాయ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ హెలికాప్టర్ ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తరిస్తోందని, ఇది అధికార దుర్వినియోగం కాకపోతే మరేంటని ప్రశ్నించారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్లపై కమిటీ చర్చ

### 15 లోగా వినతులు సమర్పించాలని సూచన

హైదరాబాద్,అక్టోబర్26 (ప్రజా మంటలు): రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన మంజూరికి అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ, ప్రథమ సమావేశం శనివారం, బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది.మీడియా అకాడమీ చైర్మన్ కె .శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్, కె.శ్రీనివాస్ , సియాసత్ న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ, అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్, ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్, కె .నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.యస్. జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించింది. రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుండి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్‌కు అందజేయాల్సిందిగా కోరింది.

## మూసీ బ్యూటిఫికేషన్ కల్ల

### డబ్బుల కోసమే రేవంత్ యత్నం

### మరోమారు ఈటెల విమర్శలు

హైదరాబాద్,(ప్రజా మంటలు): సీఎం రేవంత్ రెడ్డి మూసీ బ్యూటిఫికేషన్ చేస్తాననేది కేవలం డబ్బు సంచులు నింపుకోవడానికేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరోమారు ఆరోపించారు. ఇప్పటివరకు నిర్మించిన మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)లను ప్రారంభించే తెలివి సీఎంకు లేదని దుయ్యబట్టారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని టీకేఆర్ కాలనీలో మూసీ పరివాహక ప్రాంతాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న ఈటల.. ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా, మూసీ పేరుతో కొత్త నాటకాలకు తెర లేపారన్నారు. పేదలకు అన్యాయం చేసి పెట్టుబడిదారులకు వత్తాసు పలకడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజస్వరూపం తెలిసేందుకు ఆరేళ్లు పడితే.., రేవంత్ దుర్బుద్ధి ఆరు నెలల్లోనే బయట పడిందన్నారు. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలనకు మంచి రోజులు ముగిశాయన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదన్నారు. మూసీలో విషపదార్థాలు, రసాయనాలు చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బోనస్ దేవుడెరుగు..మద్దతుకే దిక్కులేదు: కెటిఆర్

హైదరాబాద్,(ప్రజా మంటలు): తెలంగాణలో తెల్ల బంగారం తెల్లబోతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పత్తి కొనుగోళ్ల తీరుపై ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. దళారుల చేతిలో పత్తి రైతులు చిత్తవుతున్నారని పేర్కొన్నారు. కొర్రీలతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపేసిందని చెప్పారు. రైతు ఆగమవుతుంటే ప్రభుత్వం పత్తా లేదన్నారు. పత్తి కొనుగోళ్ల అంశంలో ప్రభుత్వ చొరవ లేదని వ్యాఖ్యానించారు. రైతు డిక్లరేషన్ బోగస్.. కర్షక ద్రోహి కాంగ్రెస్ అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శింగనమలలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆరుగురు దుర్మరణం

అనంతపురం,(ప్రజా మంటలు): అనంతపురం జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద లారీని కారు ఢీకొంది. టైరు పగిలి అదుపుతప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీనీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరంతా తాడిపత్రిలో నగర కీర్తన వేడుకలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా అనంతపురానికి చెందిన సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీగా గుర్తించారు.

## అమెరికాకు చేరుకున్న నారాలోకేశ్

### పెట్టుబడులే లక్ష్యంగా పర్యటన




న్యూఢిల్లీ (ప్రజా మంటలు): పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఎయిర్‌పోర్టులో ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు. ఏపీలో ఎన్డీఏ కూటమి "అఖండ" విజయం సాధించిన తర్వాత తొలిసారిగా అమెరికాలో లోకేష్ పర్యటిస్తున్నారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగనుంది. ఈనెల 29న లాస్ వేగాస్ నగరంలో జరుగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు. 31న అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లోకేష్ పాల్గొననున్నారు. శాన్ ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. వై2కె బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఏఐ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి సాధించబోతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను మంత్రి వివరించారు. భారత్‌లో రాబోయే పాతికేళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయని , పరిపాలనలో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలను అందించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నేతృత్వంలో యువనాయకత్వం చురుగ్గా పనిచేస్తోందన్నారు. మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారని.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మ్యాన్యుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు సీఎం సరికొత్త పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసువస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యతతో కూడిన మానవవనరులను అందించడానికి, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విద్యారంగంలో కూడా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. నవీన ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యతనిస్తూ రీసెర్చి సెంట్రిక్‌గా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వైసీపీ కుట్ర




### టిడిపి పనై పోయిందన్న వారే కనుమరుగు అయ్యారు

### ఎక్కడ ఇసుక దందా జరిగినా తిరుగబాటు చేయండి

### రాజకీయంగానే ముందుకు వెళదాం..కార్యకర్తలకు న్యాయం చేస్తా

### టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు



అమరావతి,(ప్రజా మంటలు): కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు. ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి, తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మద్యం ఎమ్మార్పీ ధరపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవద్దని మందుబాబులను కోరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీపై, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీతో కలిపి రూ.97 లు అయ్యే సినరేజ్ ఛార్జీకి రూ.35లకే టెండర్ వేస్తామంటూ వైసీపీ నేతలు వచ్చారని అన్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌మార్కెటింగ్ చేసి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ఉచిత ఇసుక స్ఫూర్తి దెబ్బతినకూడదనే సినరేజ్ ఛార్జీలు, జీఎస్టీ కూడా ఎత్తి వేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.నేను 1995 సీఎంనే.. కానీ 2014 సీఎంను కాదు. ఈసారి ఖచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. విశ్వసనీయతను నిలబెట్టుకుంటూ రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ వ్యవహారాలు పట్టించు కోవట్లేదని కేడర్ నుంచి వస్తున్న విమర్శలు అర్థం చేసుకోగలను. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు భారం మోస్తున్నామనే విషయం గ్రహించాలి. మనం ఓ విషవలయంలో ఉన్నామని గుర్తించాలి. దీనిని పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం. ఇప్పటికే చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం. మొన్నటి ఎన్నికల్లో రాక్షసుడితో యుద్ధం చేశాం. వైసీపీ నేతల వల్ల నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటూనే, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చాలి. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన తప్పుడు కేసులకు చట్ట పద్ధతిలోనే పరిష్కరిస్తా. ఎవ్వరూ తొందరపడొద్దు. ఎక్కువ అంచనాలు పెట్టేసుకుని ఎవ్వరూ నిరుత్సాహపడొద్దు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా, మూల సిద్ధాంతం ప్రజాసేవని మరవద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనేక మంది నాయకులను తయారు చేసిన పార్టీ తెదేపా అని ఆ పార్టీ చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. నేటి తరం చాలా మంది తెలుగు రాజకీయ నాయకుల మూలాలు తెదేపాలోనే ఉన్నాయి. రాజకీయ కార్యకర్తల కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్యకర్తలను నాయకులుగా తయారు చేసేందుకు అనునిత్యం పనిచేస్తున్నాం. వారి సంక్షేమం కోసం ముందుకెళ్లాం. రాజకీయ కక్షలకు బలైన సంఘటనలు చాలా చూశాం. అనేక కారణాలతో కార్యకర్తలు చనిపోయారు. వారి కుటుంబాలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తెదేపా పనైపోయిందన్న వాళ్ల పనైపోయింది. పార్టీయే శాశ్వతం. తెదేపాకు ముందు.. ఆ తర్వాత అన్నట్లు తెలుగుజాతికి గుర్తింపు వచ్చింది. కార్యకర్తల మనోభావాలు గౌరవించే పార్టీ తెదేపా. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా పెట్టిన పార్టీ ఇది. జాతీయ స్థాయిలో తెదేపా పోషించిన కీలకపాత్రలు మరే పార్టీకి సాధ్యం కాలేదన్నారు. రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. క్యాడర్ నుంచి వస్తున్న విమర్శలను అర్థం చేసుకోగలను. అని చంద్రబాబు అన్నారు.



## కాంగ్రెస్‌లోనే బాంబులు వేసుకుంటున్నారు

### మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఎద్దేవా

జనగామ,(ప్రజా మంటలు): రెండు మూడు రోజుల్లో తెలంగాణలో బాంబులు పేలుతాయన్న మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించారు. బాంబులు పేలేది తమ పార్టీలో కాదని.. కాంగ్రెస్ నేతలే పరస్పరం బాంబులు వేసుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఆయనకు మద్దతుగా జగ్గారెడ్డి, ఇతర నాయకులు వేసే బాంబులు చాలవా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు ఒకరిపై మరొకరు చేసుకునే వ్యాఖ్యలు చూస్తుంటే.. ఆరు నెలల్లోనే ప్రభుత్వం పడిపోయేలా ఉందన్నారు. కేసీఆర్ హయాంలోనే పాలకుర్తితోపాటు అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో వారం క్రితం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న లకావత్ శ్రీను నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీను మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన మహాధర్నాలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యలతో కలిసి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. అంతకుముందు బాధిత కుటుంబాన్ని భారాస నేతలు పరామర్శించారు. శ్రీనునాయక్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని, గిరిజనులపై దాడి చేస్తే సహించబోమని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని భారాస నేతలు డిమాండ్ చేశారు.

## ఐఎస్ అమేయకుమార్ లీలలు

### ఇడి ముందుకు శంకర్‌హిల్స్ బాధితులు

హైదరాబాద్,(ప్రజా మంటలు): సీనియర్ ఐఏస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఈడీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని, 200 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఎ÷–లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేశారని, రాత్రికి రాత్రే పత్రాలు సృష్టించారని వాపోయారు. 40 ఏళ్లుగా పొజిషన్‌లో ఉన్నా.. పోలీసు బలగాలతో వెళ్లగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు.సర్వే నెంబరు 111 నుంచి 179 వరకు 460 ఎకరాల భూమి ఉంది. శంకర్‌హిల్స్‌లో సుమారు 3,300 మంది ఎ÷–లాట్ ఓనర్స్ ఉన్నారు. నిందితులు దాదాపు రూ.30వేల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. మాకు జరిగిన అన్యాయంపై ఈడీకి ఫిర్యాదు చేశాం. ఐఏఎస్ అమోయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పెద్దల పాత్రపై దర్యాప్తు జరపాలి' అని బాధితులు ఈడీ అధికారులను కోరారు.

# హక్కుల కోసం ఆమరణ నిరాహార దీక్షతో అమరుడైన జతీంద్ర నాథ్



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో త్యాగధనులు లక్ష్య సాధన కోసం ఆత్మార్పణం గావించారు. ఆలాంటి త్యాగ మూర్తులలో అగ్ర భాగాన నిలుస్తాడు జతీంద్ర నాథ్ దాస్. 1929లో 25 ఏళ్ల చిన్న వయస్సులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 63 రోజుల నిరాహార దీక్ష కొనసాగించి ప్రాణ త్యాగం చేసి అమరుడు అయినాడు జతీంద్ర. జతీంద్రనాథ్ దాస్ (27 అక్టోబర్ 1904 %-% 13 సెప్టెంబర్ 1929) స్ఫూర్తిదాయక స్వాతంత్ర్య సమర యోధుడు, మానవ హక్కుల కార్యకర్త, విప్లవ వీరుడు. కలకత్తాలో 1904 అక్టోబర్ 36న జన్మించాడు. చిన్నవయసు లోనే బెంగాల్లోని అనుశీలన్ సమితి అనే విప్లవ సంస్థ (20వ శతాబ్దపు భారతీయ విప్లవ సంస్థ)లో చేరాడు. భగత్ సింగ్, హిందుస్థాన్ రిపబ్లికన్ సోషలిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పనిచేశాడు. 17 ఏళ్ల వయసులో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణో ద్యమంలో కూడా పాల్గొన్నాడు.

కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజిలో బి.ఎ.చదివే సమయంలో 1925 నవంబరులో రాజకీయ కార్యకలాపాల కారణంగా అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నాడు. అక్కడ రాజకీయ ఖైదీలపట్ల చూపుతున్న దురుసు ప్రవర్తనకు నిరసనగా నిరాహారదీక్ష చేపట్టాడు. 20రోజుల నిరాహార దీక్ష తరువాత జైలు సూపరింటెండెంట్ క్షమాపణ కోరడంతో దీక్ష విరమించాడు. దేశంలోని అన్ని ప్రాంతాలనుండి విప్లవ కారులు బాంబుల తయారీకి ఆయన్ను సంప్రదించేవారు. సచీంద్రనాథ్ సన్యాల్ వద్ద బాంబులను తయారు చేయడం నేర్చు కున్నాడు.. భగత్ సింగ్, మరికొందరు విప్లవ వీరులకు బాంబులను తయారు చేశాడు. ఆయన విప్లవ కార్యకలాపాల కారణంగా ఆయనను 1929 జూన్ 14న అరెస్ట్ చేసి లాహెూర్ జైలులో పెట్టారు. లాహెూర్ జైలులో భారతీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వారు అనేక రోజుల పాటు ఉతకని, మాసిన దుస్తులను ధరించవలసి వచ్చేది. వంటశాలలో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతూ ఆహార పదార్థాలను తినడానికి హానికరంగా మార్చేవి. భారతీయ ఖైదీలకు వార్తా పత్రికలను, వ్రాసుకోవడానికి కాగితాలు ఇచ్చేవారు కాదు. కానీ అదే జైలులో బ్రిటిష్ ఖైదీల పరిస్థితి దీనికి భిన్నంగా పక్షపాతంగా ఉండేది. జతీంద్ర నాథ్ పరిస్థితులను గమనించి యూరోపియన్ ఖైదీలకు సమానంగా భారతీయ ఖైదీలకు సదుపాయాలను కల్పించాలని కోరుతూ కొందరు విప్లవ కారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షను చేపట్టాడు. ఆమరణ నిరాహార దీక్ష 1929 జూలై 13 న ప్రారంభమై 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు బలవంతంగా దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు జైలు కమిటీ ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రభుత్వం దానిని త్రోసి పుచ్చుతూ బెయిల్ మీద విడుదల కావచ్చని సూచించింది.

జతీంద్ర నాథ్ దాస్ భగత్ సింగ్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు కూడా లాహెూర్ సెంట్రల్ జైలులో ఈ నిరాహార దీక్ష కొనసాగించారు. జతీంద్ర దాస్ బ్రిటిష్ అధికారులచే దౌర్జన్యాలు, కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఫలితంగా అనారోగ్యం ఆవహించింది. ఊపిరితిత్తులకు హాని కలిగింది. పక్షవాతం శరీర భాగాలకు వ్యాపించడం ప్రారంభించింది. అయినప్పటికీ ఆయన నిరాహార దీక్ష కొనసాగించాడు. అలా ఆయన 1929, సెప్టెంబరు 13వ తేదీన తుది శ్వాస విడిచాడు. విప్లవ వనిత దుర్గావతి దేవి నేతృత్వంలో ఆయన అంతిమ యాత్ర లాహెూర్ నుండి కలకత్తా వరకు రైలులో కొనసాగింది. వేలాది మంది శ్రద్ధాంజలి ఘటించడానికి రైల్వే స్టేషన్లకు తరలి వచ్చారు. హౌరా రైల్వే స్టేషన్‌లో శవపేటికను సుభాష్ చంద్రబోస్ స్వీకరించి శవయాత్రకు నేతృత్వం వహించాడు. కలకత్తాలో రెండు మైళ్ళ పొడుగున ప్రజలు బారులు తీరి ఆయనకు తుది వీడ్కోలు చెప్పారు. జతిన్ దాస్ నిరాహార దీక్ష బ్రిటిష్ పాలకుల అక్రమ నిర్బంధాలపై ప్రతిఘటనలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది.

సుభాష్ చంద్రబోస్ ఆ త్యాగశీలిని "భారత దేశపు యువ దధీచి"గా లక్ష్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పురాతన భారతీయ ఋషిగా అభివర్ణించాడు. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" సినిమాలో జతిన్ దాస్ పాత్రను అమితాబ్ భట్టాచార్జీ పోషించాడు.

## ఎన్నిక

ఎన్ని రాత్రుల నుంచి వెలిగివున్నవో
ఈ కన్నులలో ఒత్తులు
ఒక్కొక్కరి లో కన్నీటి జలపాతం వుంది
పేలాడానికీ సిద్ధంగా అగ్ని పర్వతం వుంది
కదిలే తుఫాను లో కురిసే ప్రళయం వుంది

రైళ్ళపవనం మలయమారుతం కాలేదు
ఎడారి మేఘం జలపాతాన్ని కురవదు
సన్యాసుల గుంపేప్పుడు సైన్య బలం కాలేదు
నిరుద్యోగ పాండవపర్వత అక్షౌహిణీ ముందు
అహంకార కౌరవ సైన్యబల మేపాటిది

స్వర్ణపు నగకు సౌదామిని సొగసే అందం
కాంచనపు నాణ్యతకు నిశ్శబ్ధమే అందం
మిణుగురు పురుగులు వెలుతురు నివ్వవు
వెన్నెలను అంతకంటే ఇవ్వలేవు

కొండలు కదులుతాయి గుండెలు అదురుతాయి
రేగే చీకటిని చీల్చుటకు రేపటి బ్యాలెట్ బాక్స్ లోకీ
సూర్యుడు పిండం లా చేరతాడు
ఎన్నికల ప్రసవానంతరం చంద్రుడు అస్తమిస్తాడు
సూర్యుడు ఉదయిస్తాడు


-డా. ఐ.చిదానందం
8801444335

# దంతేరాస్ రోజు..బంగారమే కొనాలని లేదు

## తమలపాకులతోనూ లక్ష్మీదేవినిపూజించవచ్చు

ముంబై, అక్టోబర్ 26 (ప్రజామంటలు):

ధన్ తేరాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందరికీ ఈ పండుగ గురించి తెలుసు. ధంతేరాస్ రోజు ధన్వంతరీని పూజిస్తారు. ధన్వంతరీని పూజించడం వల్ల ఆర్థిక కష్టాలు, అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్న నమ్మకం. ఈ ధంతేరాస్ నుంచే దీపావళి పండుగ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది అక్టోబర్ 29న ధంతేరాస్ వస్తుంది. ఈ రోజున చాలా మంది బంగారం, వెండి ఆభరణాలను కొనుగోలు చేస్తారు.బంగారం, వెండి వస్తువులు, ఆభరణాలను కొనలేని వారు కూడా ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు చెప్పే వాటిని కొన్నా చాలా మంచిదని, ఆర్థికంగా బలపడతారని పండితులు చెబుతారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఇంట్లో ఎలాంటి శుభకార్యాలను తలపెట్టినా తమలపాకులను ఉపయోగిస్తూ ఉంటారు. తమల పాకులను లక్ష్మీ దేవి స్వరూపంగా కూడా భావిస్తారు. ధంతేరస్ రోజున తమల పాకులు కొని లక్ష్మీ దేవికి నైవేద్యంగా పెడితే.. ఆ జగన్మాత ఆశీస్సులు లభిస్తాయని అంటారు. ఆ తర్వాత రోజు వాటిని ఓ పవిత్ర నదిలో వదిలేయడం మంచిది. అలాగే కొత్తిమీర కొని ఇంటికి తీసుకొచ్చినా కూడా చాలా మంచిది. కొత్తి మీరను కూడా సంపదకు చిహ్నంగా భావిస్తారు. కాబట్టి ఈ రోజున కొత్తిమీరను కొంటే డబ్బుకు లోటు ఉండదు. పసుపు, కుంకుమలు




అమ్మవారికి ప్రీతికరంగా భావిస్తారు. కాబట్టి ధంతేరాస్ రోజున పసుపు, కుంకుమ కొని ఇంటికి తీసుకురావచ్చు. దీని వలన స్త్రీలకు వైవాహిక జీవితం సంతోషంగా ఉంటుంది. అదృష్టాన్ని కూడా తెచ్చిపెడుతుంది. ధంతేరస్ రోజున చీపుర్లు కొంటే చాలా మంచిది. ఎందుకంటే చీపురును లక్ష్మీ దేవితో సమానంగా భావిస్తారు. ఆ రోజున చీపురు కొని ఇంటికి తీసుకొస్తే.. ఐశ్వర్యం, అదృష్టం కలిసి వస్తుందట. ఇంట్లో గొడవలు కూడా తగ్గుతాయి. పేదవారికి చీపుర్లు, చెప్పులు, గొడుగులు కొని ఇచ్చినా మంచిదే. ధంతేరాస్ రోజు ఉప్పు కొన్నా చాలా మంచిది. ఉప్పును కూడా ఎంతో పవిత్రంగా చూస్తారు. ఉప్పును లక్ష్మీ దేవిగా భావిస్తారు. కాబట్టి ఈ రోజున ఉప్పును కొని ఇంటికి తీసుకొచ్చినా మంచిదే. బంగారం,వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ వాటిని కొనాలన్న నిబంధన ఏదీ లేదని కూడా అంటున్నారు. వ్యాపార ప్రకటనల మోజులో పడి ఇల్లు గుల్ల చేసుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

# మన పూజలో ఆరోగ్యసూత్రం

తిరుమల (ప్రజామంటలు):



పూజ అనేది కూడా ఒక యోగ ప్రక్రియ. మనసుతో చేసే వ్యాయామం. పూజ అంటే చాదస్తం కాదు .మన ఆరోగ్యం, మన జ్ఞానానికి సంబంధించిన విషయమని చెప్పాలి. యోగ ద్వారా మన ఆరోగ్యాన్ని మన కంట్రోల్‌లో ఉంచుకోవడం సాధ్యమని తేలింది. దానికి మరో రూపమే పూజా,ధ్యానంగా గర్తించాలి. గుడి అంటే మన స్వచ్ఛతకు చక్కటి ప్రదేశం. ధ్యానం అనేది మన మెదడుని మనమే ట్యూన్ చేసుకునే పక్రియ. దీప ప్రజ్వలనం అనేది..... త్రాటకం అనే యోగ పక్రియ. రోజూ ఓ మూడు నిమిషాలు నూనె దీపాన్ని తదేకంగా చూస్తే.... కంటి జబ్బులను అరికట్టవచ్చు అని పెద్దలు చెప్పిన మాట. ఏదైనా కష్టమైన మంత్రాన్ని ఓ 11 సార్లు జపిస్తే.. నాలిక మొద్దుబారదు. అది నాలికకు ఎక్సర్‌సైజ్. అందువల్ల ఎటువంటి కష్టమైన పదాలనైనా పలకగలిగే శక్తి వస్తుంది ..ధారణ శక్తి పెరుగుతుంది. భాష మీద పట్టు పెరిగితే... స్టేజ్ ఫియర్ కూడా పోతుంది. భూమిలో ఎక్కడయితే తరంగాలు కలుస్తాయో అక్కడ మూల విరాట్ ఉంటుంది. ప్రతిష్ఠించే ముందు రాగి రేకులను కాల్చి ఉంచుతారు. అవి ఈ తరంగాలకు ప్రేణగా పని చేస్తాయి. మనం గుడి చుట్టు ప్రదక్షిణలో తిరిగినపుడు ఆ తరంగాల శక్తి మన దేహానికి వస్తుంది. గుడిలోనే దేవుడు వుంటాడా అనేది ఒక వాదన.. ఎక్కడైన వుంటాడు కాని ఈ దేవాలయ దర్శనం అందుకు పెట్టారు. పుణ్యక్షేత్రాలు ఈ సూత్రంపైనే మీద ఆధారపడి వుంటాయి. ఇవి మన శరీరం లోని షట్ చక్రాలను ప్రభావితం చేస్తాయి. ఆడవారిని మగవారిని నగలు వేసుకుని గుడికి వెళ్ళమనేది మన సంపదను చూపించడానికి కాదు.. బంగారం వంటివి ఈ తరంగాలను బాగా గ్రహిస్తాయని. అదే విధంగా మంత్రోచ్చా రణలు అక్షర నియమంతో ఒక లయను కల్గి ఉత్తేజపరువస్తాయి. గర్భగుడి ద్వారం ఒక వైపుకు ఉండటం వల్ల ఆ శక్తిని మన శరీరం గ్రహిస్తుంది. అందుకే మరీ ఎదురుగా కాక ఒక వైపుకు ఉండమంటారు. విగ్రహాలు పంచ లోహాలతో ఉంటాయి.. వాటికి పాలు తేనె వంటి వాటితో అభిషేకించినపుడు కింద ఉన్న తరంగాల శక్తితో ఔషధ గుణాన్ని సంతరించుకుంటాయి. హారతి తీసుకునేటపుడు ఆ వెచ్చదనాన్ని మన కంటికి తగిలేలా చేయాలి.. దీనికి ఆయుర్వేద పరిభాషలో స్వేదకర్మ అని పేరు. ఊరికే గాల్లో హారతి తీసుకుంటే చాలదు. తీర్థంలో పచ్చ కర్పూరం.. తులసి.. లవంగాలు ఇలా ఎన్నో.. పంచామృతంతో అభిషేకం చేసినవి తీర్థంగా ఇస్తారు. తడిబట్టలకి ఆక్సిజన్ ని ఎక్కువగా తీసుకునే గుణం ఉంటుంది.. అందుకే మడిని పాటిస్తారు. ఇవన్నీ కూడా మన సైన్సును ఆధారం చేసుకుని ఆచరించేలా చేసినవని గుర్తించాలి. వీటిని ఆచరిస్తే ఆరోగ్యం మనలను వెన్నంటి ఉంటుంది.

## ట్రాన్స్‌కోకు గుదిబండగా విద్యుత్ బకాయిలు

### బిల్లులు చెల్లించడంలో స్థానిక సంస్థల నిర్లక్ష్యం

హైదరాబాద్, (ప్రజామంటలు):మున్సిపల్ పరిధిలో విద్యుత్ బకాయలు చెల్లింపు జరక్క అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో డిస్కంలకు రుణభారం పెరుగుతోంది. కొన్ని మునిసిపాలిటీలుగా మారాక కరెంట్ బిల్లు బకాయిపడితే మరికొన్ని గ్రామపంచాయతీల ఆదాయం లేక బకాయిలను మూటగట్టు కున్నాయి. వీధి దీపాలు, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్‌ను వాడుకుంటున్నా బిల్లులు చెల్లించడం లేదు. బిల్లుల చెల్లింపు విషయంలో మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్న తీరు విద్యుత్ శాఖకు ఇబ్బందికరంగా మారిందని అధికారులు వాపోతున్నారు. దీంతోవిద్యుత్ బకాయిల చెల్లింపులో మునిసిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నాయి. మున్సిపాలిటీలు ట్రాన్స్‌కోకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలోపేరుకుపోయాయని సమాచారం. కొన్ని మునిసిపాలిటీలు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడం విద్యుత్ శాఖకు భారంగా మారింది. వాటికి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు రావడం లేదు. దాంతో కార్యాలయాలకు కరెంట్ కట్ కాకుండా చూసుకుంటున్నారు. మిగిలిన వాటికి విద్యుత్ సరఫరా నిలిపి వేసే అవకాశంలేనందున పట్టించుకోవడం లేదు. దీంతో అనేక మునిసిపాలిటీల బకాయిలు కొన్నేళ్ల నుంచి పేరుకుపోయినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నా రు.

## ఒకే పోలీస్ విధానం కోసం

### తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు

హైదరాబాద్, (ప్రజామంటలు):

ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఆందోళనల నేపథ్యంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. ఎస్ఐ గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. పోలీసుల కుటుంబసభ్యులపై సైదాబాబు దురుసుగా ప్రవర్తించారని నిరసనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు.

# ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి !

గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పొరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కడా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహరధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందనడానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు మేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధి లేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారిని గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయ్యా యన్నది గుర్తించాలి. కార్పొరేట్లు తీసుకున్న రూ. 4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ. 2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ది చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. ఈ పదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ ఏమయినట్లో మోడీ సర్కారే చెప్పాలి.




## దేవస్థానం పనులలో ఆలస్యం ఆక్షేపణీయం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

(రామకిష్టయ్య సంగనబట్ల)

ధర్మపురి అక్టోబర్ 26 (ప్రజా మంటలు) : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంకు సంబంధించిన అభివృద్ధి పనులలో ఆలస్యం ఆక్షేపణీయమని, సకాలంలో చేయని వారికి నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. దేవస్థానంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఇఓ సంకటాల శ్రీనివాస్, ఇంజనీరింగ్ తదితర సంబంధిత అధికారులతో కోట్లాది నిధులతో చేపట్టిన, చేపట్టనున్న వివిధ పనుల గురించి విప్ లక్ష్మణ్ కుమార్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ, పనులను గడువులోపు పూర్తి చేయాలని సక్రమంగా పనిచేయని వారికి నోటీసులు జారీ చేయవలసినదిగా సూచించారు. దేవస్థానమునకు వచ్చే భక్తులకు రుచికరమైన భోజనము అందించాలని మహా అన్నదానము భవనము నిర్మించుటకు దాతలు ముందుకు వస్తున్నారని, కనీసం 500 మందికి భోజన వసతి కల్పించుటకు సూచించారు. భూసేకరణ విషయములో కోర్టులో కేసులు త్వరితగతిన పరిష్కరించి, భూసేకరణ చేయాలని యజమానులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అదే విధముగా వివిధ నిర్మాణ పనులకు 50 కోట్లకు ఎస్టిమేట్స్ వేయించి ఇచ్చినట్లయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి నిధులు మంజూరి చేయిస్తానని, ఎటువంటి ఆలస్యము లేకుండా అభివృద్ధి పనులకు అంచనాలు తయారుచేసి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా గోదావరి తీరములో అత్యవసరముగా భక్తులు సేద తీరుటకు శాశ్వతంగా డార్మిటరి, భక్తుల సౌకర్యార్థం బట్టలు మార్చుకొను గదులు, మరుగుదొడ్లు, షవర్లు ఏర్పాటు చేయుటకు సత్వర చర్యలు గైకొనగలరని ఆదేశించారు. స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మెట్ పెల్లి ఆర్.డి.ఓ. శ్రీ శ్రీనివాస్, స్థానిక తహశీల్దార్ కృష్ణచైతన్య, దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ సంకటాల శ్రీనివాస్, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రాజేష్, డిప్యూటి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్, రఘునందన్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.ప్రతాప్, దేవస్థాన పర్యవేక్షకులు డి.కిరణ్, సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాస్

పాల్గొన్నారు.అంతకు ముందు ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానము దర్శనమునకు వచ్చు భక్తులకు మెరుగైన సౌకర్యములు కల్పించుటకు, గోదావరినది స్నానము చేయు భక్తులకు వసతుల కల్పనకు, వివిధ అభివృద్ధి పనుల గూర్చి సమీక్ష చేయు సందర్భములో ఉదయం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, బస్టాండు వద్ద గల 60 గదుల ధర్మశాల నిర్మాణము, కె.ఎన్.ఆర్. షాపింగ్ కాంప్లెక్స్లు, పుట్ట బంగారము నిర్మాణమును, నాగమయ్య దేవాలయము నిర్మాణమును పరిశీలించారు.



కరీంనగర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కు మాతృ వియోగం జరుగగా, వారి కుటుంబాన్ని మాజీ మంత్రి శ్రీ జి. రాజేశం గౌడ్, మాజీ జిల్లా పరిషద్ సభ్యులు గుర్రాల మల్లేశం పరామర్శించారు.



## దండుపాళ్యం బ్యాచ్‌లా బిఆర్ఎస్ సోషల్ మీడియా

### కేటీఆర్, హరీష్ రావులకు మతి భ్రమించింది

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్26 (ప్రజామంటలు): బిఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం బ్యాచ్‌లా మారిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్లను వదిలిపెట్టనని హెచ్చరించారు. తాను కలెక్టర్‌ను తిట్టినట్టు వీడియో క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై ట్రోల్ చేసేవాళ్లు దొరికితే బట్టలూడదీసి కొడతాననని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులపై జగ్గారెడ్డి విరుచుకు పడ్డారు. వారిద్దరికీ మతిభ్రమించిందని దుయ్యబట్టారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారం లేక కెటిఆర్, హరీశ్ రావు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. ఇక, మహిళా కలెక్టర్‌పై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ కలెక్టర్‌కు తాను ఫోన్ చేస్తే ఎత్తలేదని, దీంతో తనకు కోపం వచ్చి తిట్టానంటూ బహిరంగంగానే చెప్పారు. కలెక్టర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై జగ్గారెడ్డి మరోసారి స్పందించారు. తాను చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత కలెక్టర్‌ను ఉద్దేశించి కాదని.. గత ప్రభుత్వ హయాంలో కలెక్టర్లపై వ్యాఖ్యలు చేసినట్లు ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఇద్దరు కలెక్టర్‌లకు పది సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు.. వాళ్ళని తిట్టాను.. తప్పేంటి. నేను తిట్టింది గత ప్రభుత్వంలో... ఇప్పుడు కాదు‘ అంటూ వివరణ ఇచ్చారు.అలాగే.. బీఆర్ఎస్ సోషల్ మీడియాపైనా జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ సోషల్ మీడియా దండుపాళ్యం ముఠాలాగా తయారైందంటూ విరుచుకుపడ్డారు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్, హరీష్ రావుకు పిచ్చిపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా చర్యలతో కేటీఆర్, హరీష్ రావులు తిట్లు తింటున్నారన్నారు. అమెరికా, సింగపూర్‌ల నుంచి సోషల్ మీడియా నడపడం కాదని... దమ్ముంటే ధైర్యంగా ముందుకు రావాలన్నారు. సోషల్ మీడియా నడిపేది ఎవడో తెలిస్తే ఖైరతాబాద్ సెంటర్లో బట్టిలిప్పి కొడతా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాడితే తప్పులేదని.. కానీ వ్యక్తిగత అంశాలపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేస్తోందన్నారు. సీఎం వ్యాఖ్యలు అననివి అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈరోజు వార్నింగ్ ఇస్తున్నా తేడా వస్తే తాట తీస్తా. రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డి ఫైటర్స్.. బీఆర్ఎస్ నేతలు ఇలానే వ్యవహరిస్తే మా సోషల్ మీడియాను రంగంలోకి దింపుతాం. కేటీఆర్ డబుల్ లచ్చా. చిట్టి నాయుడు కాదు... రేవంత్ రెడ్డి గట్టి రెడ్డి. రేవంత్ రెడ్డి తన ఛాంబర్లో తొడగొడితే కేటీఆర్‌కు కాళ్ళు వణుకుతాయి. జగ్గారెడ్డి మాటే శాసనం అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తనకు కోపం వస్తే ఇలాగే ఉంటుందని అన్నారు.



## అవగాహన లేమితో క్యాన్సర్ మరణాలు

### మహిళల్లో బ్రెస్ట్క్యాన్సర్‌తో మహిళల మృత్యువాత

### ప్రాణనష్టాన్ని నివారించాల్సిన బాధ్య అందరిదీ

### తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదు

### బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ వాక్ లో మంత్రి దామోదర

హైదరాబాద్,అక్టోబర్26 (ప్రజామంటలు): క్యాన్సర్ గురించి అవగాహన లేకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి, ప్రాణ నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇండియాలో ఏటా 14 నుంచి 15 లక్షల కేసులు నమోదవుతుంటే, తెలంగాణలో 50 నుంచి 60 వేల కేసులు నమోదవుతున్నాయన్నారు. ఎమ్ఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ వాక్ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. నాన్ కమ్యునికేబుల్ డిసీజ్‌లు అన్నింటిలోకెల్లా క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమన్నారు. క్రమశిక్షణ లేని జీవన విధానం సహా అనేక కారణాలు ఈ వ్యాధి ప్రబలడానికి కారణమవుతున్నాయన్నారు. మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని.. మొత్తం ఉమెన్ క్యాన్సర్ బ్డ్గ÷న్‌లో 14 శాతం బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధిత కేసులే ఉంటున్నాయని డాక్టర్లు చెబుతున్నారని.. దీనిపై అవగాహన కల్పించి, స్క్రీనింగ్ చేస్తే ఎర్లీ స్టేజ్‌లో రోగ నిర్ధారణ చేయొచ్చని చెప్పారు. తద్వారా క్యాన్సర్‌ను పూర్తిగా నయం అయ్యేలా ట్రీట్‌మెంట్ అందించవచ్చన్నారు. ప్రతి మహిళా స్క్రీనింగ్ చేయించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్ అందిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో మొబైల్ ల్యాబ్స్ ద్వారా ఉచితంగా స్క్రీనింగ్ చేయిస్తామన్నారు. 6 క్యాన్సర్ రీజినల్ సెంటర్స్ ఏర్పాటు చేయబోతున్నా మని.. ఈ సెంటర్లలో డాక్టర్లు, పూర్తి స్థాయిలో ఎక్విప్‌మెంట్ తీసుకొస్తామన్నారు. ఈ సెంటర్లు అన్నింటికీ ఎంఎన్‌జే హాస్పిటల్ హబ్‌గా ఉంటుందని వెల్లడించారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ ఒక్కరోజులోనో, ఒక్క వారంలోనో అయ్యేది కాదని.. నెలలు, సంవత్సరాల తరబడి సాగుతుందన్నారు. పేషెంట్లకు ఫిజికల్, మెంటల్, ₍÷నాన్షియల్ సపోర్ట్ చాలా అవసరమని.. దానికోసమే పాలియేటివ్ రిహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. డయాబెటీస్ క్లినిక్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. క్యాన్సర్ వాక్ అనంతరం క్యాన్సర్ హాస్పిటల్‌లో మంత్రి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏమ్ఎన్ జే క్యాన్సర్ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షేత్రస్థాయిలో స్వయంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో పాథలాజి ల్యాబ్స్, పెట్ స్కాన్, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, మెమ్మొ గ్రామ్, పేషంట్ కేర్ పార్ట్స్, బోన్ స్కాన్, అల్టా సౌండ్ విభాగాలతో పాటు పాలియేటివ్ కేర్ యూనిట్లను పరిశీలించారు. వాటి వినియోగంపై ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోజుకి ఎంత మంది క్యాన్సర్ రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు అనే విషయాన్ని డాక్టర్లు నర్సింగ్ సిబ్బందితో పాటు ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు వచ్చిన రోగుల బాగోగులను, సమస్యలను కూడా మంత్రి దామోదర రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు.

## చేయూత పెన్షన్ దారులను ఏకీకృతం చేస్తా

### మందకృష్ణ మాదిగ హెచ్చరిక



హైదరాబాద్, అక్టోబర్26 (ప్రజామంటలు): చేయూత పింఛన్‌దారు లందరినీ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏకీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. చేయూత పింఛన్ తీసుకునే వారిని రేవంత్ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. వీరితో కలిసి బలమైన ఉద్యమం చేపడతామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నమ్మిన పింఛన్‌దారులు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. 10 నెలలు అయినా.. ఎందుకు పెంచి ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

‘ఏపీలో ఏప్రిల్ నెలలో మేం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చాం. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని కోరాం. ఆయన జూన్‌లో అధికారంలోకి రాగానే ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలవి ఇచ్చారు. ఏపీలో కండరాల క్షీణత ఉన్నవాళ్లకు రూ.15 వేల పింఛన్లు ఇస్తున్నారు. రేవంత్ కంటే చంద్రబాబు చాలా నయం. తెలంగాణలో వచ్చే నెల మొదటి వారంలో గడిచిన 10 నెలల బకాయిలతో పాటు నవంబర్ పింఛన్ ఇవ్వాలి. లేదంటే ఉద్యమం తప్పదు. నవంబర్ 1 నుంచి 16 వరకు ప్రతిరోజు రెండు జిల్లాల్లో చేయూత పింఛన్ లబ్దిదారులకు చైతన్య సభలు నిర్వహిస్తాం. అప్పటికీ ఇవ్వకుంటే నవంబర్ 26న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తాం 26న వికలాంగుల మహా గర్జన పేరిట వేలాది మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపడతాం. కాంగ్రెసేతర అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తాం. రేవంత్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటాం‘ అని మందకృష్ణ అన్నారు.

### గుండెపోటుతోనే ఆది పవన్ కుమార్ మృతి

### జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు

విజయవాడ, (ప్రజామంటలు): కృష్ణా జిల్లా పామర్రు మండలం జుజ్జవరం గ్రామానికి చెందిన గార్లపాటి ఆది పవన్ కుమార్ విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. చికత్సలో వైద్యపరంగా ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదని విజయవాడ జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు తెలిపారు. ఆదిపవన్‌కుమార్‌ను మచిలీపట్నం నుంచి బంధువుల సూచన మేరకు విజయవాడకు తరలించారని.. వైద్యసేవల పరంగా ఎలాంటి జాప్యం జరగలేదన్నారు. ’పవన్‌కు జ్వరం తీవ్రమై రక్తకణాలు ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో అతను గుండెపోటుకు గురై మృతి చెందారని’సూపరింటెండెంట్ ఏవీ రావు చెప్పారు. అంతకుముందు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పవన్ చనిపోయారని బంధువులు విజయవాడ జీజీహెచ్‌లో కొంతసేపు ఆందోళన చేయగా.. ఈ విషయం రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దృష్టికి వెళ్లింది. దీనిపై సూపరింటెండెంట్ మీడియాకు వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై నలుగురు వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు

తిరుపతి, (ప్రజామంటలు): తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్ పార్క్, వైస్రాయ్ హోటల్ సహా మరో రెండు ప్రాంతాలకు తాజాగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఆయా హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఎక్కడా పేలుడు పదార్థాలు దొరకలేదు. దీంతో వాటిని ఫేక్ మెయిల్స్‌గా పోలీసులు నిర్ధారించారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతిలో నాలుగు రోజుల క్రితం కూడా ఈ నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టారు. అప్పుడు కూడా ఫేక్ మెయిల్స్‌గా నిర్ధారించారు. దీనిపై రెండు కేసులు నమోదు చేశారు.

# పర్యావరణ హితం పట్టని పాలకులు

### పెరుగుతున్న పట్టణీకరణతో కాలుష్యం నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం

న్యూఢిల్లీ,అక్టోబర్ 26 (ప్రజామంటలు): పర్యావరణ పరిరక్షణ అన్నది కేవలం నినాదంగా మారింది. ఢిల్లీ విషయమే తీసుకుంటే వాతావరణ కాలుష్యం అరికట్టే చర్యలు కానరావడం లేదు. కోర్టులు మొత్తుకుంటున్నా పట్టింపు లేదు. కాలుష్యం కారణంగా తాను వాకింగ్‌కు కూడా వెళ్లలేక పోతున్నానని సుప్రీం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హం. ఎంతగాపరిస్థితి దిగజారిందో గుర్తించాలి.ఢిల్లీ కాలుష్యపరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గాలి నాణ్యత పడిపోతున్నా పట్టించుకోవడం లేదు. పంట వ్యర్థాలను కాల్చకుండా కూడా అరికట్టడం లేదు. మానవాళికి చెట్లు చేసే మేలేమిటో తెలుసుకోవడానికి ఎవరూ గూగుల్‌ను ఆశ్రయించనవసరం లేదు. పర్యావరణవేత్తలు చెబితే తప్ప తెలియని వారెవరూ లేరు. చెట్ల ఉపయోగాల గురించి బడి చదువుల దగ్గరనుంచి గురువులు నూరిపోయడమే ఇందుకు కారణం. దురదృష్టమేమంటే అధికార పీఠాలపై ఉన్న నేతలు, ఉన్నతాధికార వర్గంలో పనిచేస్తున్నవారు ఏ బళ్లో చదువుకుని ఆ స్థాయికి ఎదిగారోగానీ... దేశంలో 'అభివృద్ధి' పేరు చెప్పి వృక్ష సంహారం జరగని రోజంటూ దేశంలో ఉండటం లేదు. చెట్లను కాపాడటానికి పర్యావరణ ఉద్యమకారులు చేయని పోరాటమంటూ లేదు. ప్రాణవాయువును అందిస్తున్న వృక్షజాలాన్ని ధ్వంసం చేయాలా అని ప్రశ్నిస్తున్నారు. విభిన్న జాతుల పక్షుల్ని వీక్షించడానికి, తమ కెమెరాల్లో బంధించడానికి విహంగ ప్రేమికులు నిత్యం ప్రకృతి ఒడిలోకి వస్తారు. ప్రశాంతంగా స్వచ్ఛమైన వాయువు పీల్చి పునీతులు కావడానికి నగర వాసుల్లో అత్యధికులు ఎన్నుకునే పార్కులు, చెట్లు ఉన్నచోటే. ఇది లోపించడం వల్ల ఇటీవల ఢిల్లీ కాలుష్యం పీల్చలేనంతగా తయారయ్యింది. చెట్లనుంచి వీచే గాలిని ఆస్వాదిస్తూ వందలమంది సైక్లింగ్, జాగింగ్ చేస్తుంటారు. పాలకుల తీరు కారణంగా, నగాల వ్యాప్తి కారణంగా ముంబైతో సహా మన మహానగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఉపాధి దొరుకు తుందని పల్లెలు వీడి వస్తున్న వారితో పట్టణీకరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ విపరీతంగగా వాడకం పెరరిగి అనేకం కాలుష్య కారకాలుగా



తయారయ్యాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్యభరిత నగరాలు 20 ఉంటే అందులో 15 మన నగరాలే. తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రపంచంలోని 15 నగరాల్లో మన వాటా 11. ఈ నగరాల వాతావరణంలో, ఇక్కడి తాగునీటిలో మృత్యువు దాగుందని నిపుణులు చాన్నాళ్లుగా చెబుతున్నారు. నగర పౌరుల ఊపిరితిత్తుల్లోకి కొంచెం కొంచెంగా చొరబడుతున్న కాలుష్యం వారిని రోగగ్రస్తులుగా మారుస్తోంది. కేన్సర్, గుండె జబ్బులు వగైరాలకు కారణమవుతోంది. అనేకుల్లో అకాల వృద్ధాప్యాన్ని కలిగిస్తోంది. వారిని పనిపాటలకు దూరం చేస్తోంది. ఇదంతా మన పాలకులకు ఆందోళన కలిగించాలి. దీన్ని సరిచేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి పురిగొల్పాలి. కాలనీలో చెట్లు పెంచాలి. ఉన్న చెట్లను తొలగించకతప్పదను కుంటే ఆ చెట్లను మరొకచోట పాతడానికి ప్రయత్నించాలి. ప్రపంచ అధ్యయన సంస్థలు చెబుతున్న వాస్తవాలను అమలు చేయాలి. ఇల్లు కట్టుకుందా మనో, ఉన్న ఇంటిని విస్తరించుకుందామనో ఎవరైనా తమ ఆవరణలో చెట్లు కొట్టాలంటే అందుకు అనుమతులు తీసుకోవడం అవసరం. కానీ తమకు అలాంటి నిబంధనలు వర్తించవన్నట్టు అధికార యంత్రాంగాలు ప్రవర్తిస్తున్నాయి. పాలకులే ఇలా చట్టాల్ని ధిక్కరించే స్థితికి దిగజారడం కారణంగా దేశంలో పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.



# మెటుపల్లి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రవిచంద్రన్

కోరుట్ల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
ఏఐటియుసి మున్సిపల్ కార్మిక రంగం రాష్ట్ర అధ్యక్షులు కే రవిచంద్రన్, కార్యదర్శి వి జైపాల్ రెడ్డి మెటుపల్లి మున్సిపల్ కార్మికులను కలిసి సమావేశమై చర్చించిన సమస్యలపైన మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు గత ప్రభుత్వం పెంచిన 1000 రూపాయలు ఏడు నెలల బకాయిలు చెల్లించాలని %జూ×% తక్షణమే అమలు చేయాలని వారికి ఇవ్వాల్సిన పనిముట్లు పారాలు, చీపిరిలు, సబ్బులు, బూట్లు, బ్లౌజులు, వెంటనే ఇవ్వాలి అలాగే వీరికి జీతాలు 1 నుండి 5 తారీకు లోపు జీతాలు ఇవ్వాలి రెవెన్యూ కు సంబంధం లేకుండా కార్మికులందరికీ హెడ్ ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి %జూ% పండగ సెలవులు %ణహీూ% సర్క్యులర్ ప్రకారం అమలు చేయాలి అలాగే క్యేటరింగ్ ల వారీగా ఉద్యోగులుగా గుర్తించాలి పై సమస్యల మీద తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఉస్మాన్, నాయకురాలు మధురమ్మ, మున్సిపల్ కార్మిక అధ్యక్షులు బి లక్ష్మణ్, ఎల్ శ్రీకాంత్, టి సుమన్, వాజిద్, ఇతర మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# రైతులు పొలాల వద్ద స్టార్టర్లు, ఫీజుల నాణ్యత చూసుకోవాలి

## ఎన్ పిడీసిఎల్ జగిత్యాల ఎస్ఇ సాలీయా నాయక్



కోరుట్ల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
రైతులు పొలాల వద్ద స్టార్టర్లు, ఫీజులు, స్టార్ట్ డబ్బా నాణ్యత ఉండేలా చూసుకోవాలని, ఎన్ పిడీసిఎల్ జగిత్యాల ఎస్ఇ సాలీయా నాయక్ సూచించారు. మేడిపల్లి, బీమారం మండల్లాల్లోని కాచారం, వెంకట్రావుపేట్ గ్రామాల్లో"పొలం బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ సాలీయా నాయక్ మాట్లాడుతూ రైతులు పొలాల వద్ద స్టార్టర్లు, ఫీజులు, స్టార్ట్ డబ్బాలు నాణ్యతతో ఉండేలా చూసుకోవాలన్నారు.లో ఓల్టేజి సమస్య రాకుండా ప్రతి రైతులు కెపాసిటర్ లను అమర్చుకోవడం తప్పనిసరి అని సూచించారు. విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. రైతులు, నోరులేని మూగజీవాలు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే అధికారులకు తెలపాలన్నారు. గ్రామాలకు నాణ్యమైన సేవలు అందించే విద్యుత్ సిబ్బందిని ఎస్ఇ అభినందించారు. ఈ కార్యక్రమంలో మెటుపల్లి డిఈ గంగారాం,కోరుట్ల రూరల్ ఏడిఈ రఘుపతి,ఏఈ అశోక్ , ఏఈ అర్జున్ , సబ్ ఇంజనీర్ ఎక్కల్ దేవి హరిప్రసాద్ , మన్నెగూడెం , మేడిపల్లి సెక్షన్ విద్యుత్ సిబ్బంది, గ్రామాల ప్రజలు , రైతులు పాల్గొన్నారు.

# ఆల్ సోల్స్ డే కు అన్ని ఏర్పాట్లు చేయండి

ఆల్ సోల్స్ డే కు అన్ని ఏర్పాట్లు చేయండి

## ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



సికింద్రాబాద్, అక్టోబర్ 26 ( ప్రజామంటలు ) :
నవంబర్ 2 న నిర్వహించే ఆల్ సోల్స్ డే ( పవిత్ర ఆత్మలదినం) కు అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బన్సీలాల్ పేట లోని బోయగూడ లో గల క్యాథలిక్ గ్రేవ్ యార్డ్ లో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై శనివారం మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆల్ సోల్స్ డే సందర్భంగా గ్రేవ్ యార్డ్ కు వేలాదిమంది వస్తారని, వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గ్రేవ్ యార్డ్ కు పెయింటింగ్ వేయడం, శుభ్రపర్చడం, అవసరమైన లైటింగ్ ఏర్పాటు, చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, ఈఈ సుదర్శన్, హార్టికల్చర్ అధికారి గణేష్, ఎలక్ట్రికల్ ఏడీ మోహన్, స్ట్రీట్ లైట్ ఏఈ భరత్, శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి, గ్రేవ్ యార్డ్ నిర్వహకులు జయరాజ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు వెంకటేషన్ రాజు,ఏసూరి మహేష్, రమణ, సురేష్ పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వేములకుర్తి గ్రామంలో, పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా, జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థులు మరియు యువతతో కలిసి ఇబ్రహీంపట్నం ఎస్సై ఏ అనిల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత చెడుదారులు పట్టకుండా భవిష్యత్తు కాలంలో రానున్న అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు, ఇట్టి కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్సై ఏ అనిల్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ సాధు నాయక్, సంతోష్ లు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది, అదికారులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్








జగిత్యాల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని , వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయ%శీ%లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై పోలీస్ సిబ్బందితో పాటు వైద్య పరీక్షలు చేపించుకున్నారు జిల్లా ఎస్పీ ఈ వైద్య శిబిరంలో అధికారులకు,సిబ్బందికి నిపుణులైన వైద్యులతో వివిధ వైద్య సేవలు నిర్వహించడంతో పాటు, సిబ్బందికి వైద్యులు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు.
జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విధులు సమర్థంగా నిర్వహించగలరన్నారు. శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండే ఉండడం అనేది ప్రతి ఒక్క వ్యక్తికి అవసరమని పోలీస్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ఇది చాలా అవసరం అని అన్నారు. హెల్త్ క్యాంపుకు సహకరించిన మెడికల్ హాస్పిటల్ డాక్టర్స్ కి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ శిభిరంలో 300 మంది పోలీస్ సిబ్బంది,వారి కుటుంబ సభ్యులకి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ భీం రావ్, డిఎస్పీలు రవీంధ్ర కుమార్, రఘు చందర్, ఉమా మహేశ్వర రావు, వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దిలీప్‌రెడ్డి, డాక్టర్ ప్రతిష్టారావు, డాక్టర్ అనీష్, డాక్టర్ తాహా, డాక్టర్ హర్షిత్, ఆర్.ఐ లు కిరణ్ కుమార్, రామక్రిష్ణ, వేణు, ఐటి కోర్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్,రఫిక్ ఖాన్, పోలీస్ సిబ్బంది హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



మండలం లోని వడ్డెర కాలనికి చెందిన సుర రాజయ్య లక్ష్మి దంపతుల కుమారుడు సూర కరుణాకర్ భారత నేవీ నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి, భారత నేవీలో ఉద్యోగం సాధించగా, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు.

# తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏనుగు ఆదిరెడ్డి, రాచ గంగయ్య



కొడిమ్యాల: అక్టోబర్ 26( ప్రజా మంటలు) :
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకట రమణ రావు అద్వర్యం లో తపస్ కొడిమ్యాల మండల శాఖ ఎన్నికలు జరిగాయి. కొడి మ్యాల మండల అధ్యక్షులు గా ఏనుగు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాచ గంగయ్యలను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకట రమణ రావు మాట్లాడుతూ స్కూలు డ్రెస్సుల్లో నాణ్యత ఉండే విదంగా చూడాలని,ప్రభుత్వం వెంటనే 5 డీ ఏ లను,పీ ఆర్ సి నీ ప్రకటించాలని,317 జి ఓను రద్దు చేయాలనీ, పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలని, ఎస్ జి టి లకు ఎమ్మెల్సీ లో ఓటు హక్కు కల్పించాలని, బీఈడీ చేసిన సెకండరీ గ్రేడ్ టీచర్స్ తో 10000 లు పోస్టులు మంజురు చేసి పి ఎస్ హెచ్ ఎమ్ పోస్టులు భర్తీ చేయాలని, కేజీవివి , మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీర మల్ల వెంకట రమణ రావు, జిల్లా కార్యదర్శి గోనే శ్రీని వాస్, జిల్లా సహ కార్యదర్శి కల్యాణ్, తపస్ మండల బాధ్యులు గుడి భూపతి రెడ్డి,బొమ్మ సురేష్, ప్రవీణ్రెడ్డి,రాజన్న,వెంకటేశం, మన్మధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# కుట్టు మిషన్ శిక్షణార్థులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, చైర్పర్సన్

జగిత్యాల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
పట్టణములోని 9వ వార్డులో వాల్మీకి ఆవాసం – సేవా భారతి ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ,స్థానిక కౌన్సిలర్ వొద్ది శ్రీలత రామ్మోహన్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,ఎమ్మెల్యే సతీమణి రాధిక,ఆవాసం సభ్యులు పురుషోత్తం,మదన్ మోహన్ రావు,అశోక్ రావు,మహిపాల్ రెడ్డి,మల్లేశం,సంపూర్ణ చారి,రోటరీ క్లబ్ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్,నాయకులు ప్రభాత్ సింగ్ ఠాగూర్,రామకృష్ణ,గట్టు రాజు,ప్రవీణ్ రావు,శ్రీనివాస్,క్రాంతి, రాజు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ కృషి చేయాలి

## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
నేరం చేసిన వారికి శిక్ష తప్పదనే భయం కలిగిస్తే, సమాజంలో చాలా వరకు నేరాలు తగ్గుతాయని జిల్లా ఎస్పీ అన్నారు. ఈరోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని అన్నారు. కేసుల్లో శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులు, కోర్టులో పెండింగ్ కేసులపై, వారెంట్స్, సమన్స్ తదితర అంశాలను సమీక్షించారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలం ను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారుల పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేసుల్లో నిందితులను దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా పని చేయాలని, కోర్టు అధికారుల తో సమన్వయంతో పని చేయడం ద్వారా సాక్షులను, నింధితులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని చెప్పారు. బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పి పి ల యొక్క సలహాలు సూచనలు స్వీకరించాలని సూచించారు. సమావేశం లో డిఎస్పీ రవీంద్ర కుమార్, డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సీఎంఎస్ ఎస్.ఐ రాజు నాయక్, లు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# పలు వార్డులలో నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే, చైర్ పర్సన్

జగిత్యాల అక్టోబర్ 26 (ప్రజా మంటలు) :
పట్టణంలో 4 6 20 21 వార్డులలో 25 లక్షలతో సిసి రోడ్డు, డ్రైనేజీ,డ్రైనేజీ స్లాబ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, ఆయా వార్డులలోఅధికారులు,నాయకులతో కలిసి చేపట్టాల్సిన పనులను జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పరిశీలించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల పట్టణం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని, ముఖ్యమంత్రి చొరవతో టి యు ఎఫ్ ఐ డి సి నిదులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం త్వరిత గతిన విస్తరిస్తుందని, జిల్లా కేంద్రం తో పాటు పరిసర ప్రాంతాలలో అభివృద్ధి కి కృషి చేస్తున్నాని, యావర్ రోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో 1కిమి మేర యావర్ రోడ్డు విస్తరించి, అత్యాధునిక డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయటం జరిగిందని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి యావర్ రోడ్డు విస్తరణకు కృషి చేస్తానని, నేషనల్ హై వే పరిధి లో ఉన్న యావర్ రోడ్డు కు కేంద్రము నుండి సైతం స్థానిక ఎంపి సహకారం తో నిధుల మంజూరుకు తనవంతుగా కృషి చేస్తానాని అన్నారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,కౌన్సిలర్లు అనుమల్ల కృష్ణ హరి, క్యాధసు నవీన్, కొలగాణి ప్రేమలత సత్యం,అల్లె గంగసాగర్, ఏ ఈ అనిల్,నాగయ్య,శ్రీ మంజరి, శరత్ రావు, ప్రభత్ సింగ్ ఠాగూర్,రామ కృష్ణ,ప్రవీణ్,మహేందర్, కౌన్సిలర్ లు,మున్సిపల్ సిబ్బంది,నాయకులు,యువకులు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ పంజా

- సైనిక స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడిన ఐడీఎఫ్ దళాలు
- దాడుల్లో ఇద్దరు సైనికులు మృతి
- పరిమితస్థాయిలోనే నష్టం: ఇరాన్




టెహ్రాన్ (ప్రజా మంటలు):
పశ్చిమాసియాలో మరోసారి యుద్ధమేఘాలు అలుముకున్నాయి. తమ దేశంపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ శనివారం టెహ్రాన్‌పై విరుచుకుపడింది. ఇరాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో ఇరాన్‌కు చెందిన ఇద్దరు సైనికులు మృతి చెందినట్లు ఆ దేశ అధికారిక మీడియా తాజాగా వెల్లడించింది. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. టెహ్రాన్‌లోని దాదాపు 20 లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. దాదాపు 100 యుద్ధ విమానాలను ప్రయోగించి బాంబులు జారవిడిచింది. ఇరాన్‌కు చెందిన డ్రోన్ ఫ్యాక్టరీలు, బాలిస్టిక్ క్షిపణి తయారీ, ప్రయోగ కేంద్రాలపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో దక్షిణ టెహ్రాన్‌లోని ఓ డ్రోన్ ఫ్యాక్టరీ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. అయితే, ఐడీఎఫ్ దాడుల కారణంగా తమకు నష్టం స్వల్ప స్థాయిలోనే ఉందని ఇరాన్ వెల్లడించింది.కాగా.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఖండించింది. ఈ ఘర్షణల కారణంగా ప్రాంతీయ భద్రత, స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రంగా కాకుండా సంయమనం పాటించాల్సిన అసవరం ఉందని సూచించింది. అయితే, తమ ప్రకటనలో ఇజ్రాయెల్ పేరును యూఈఏ పేర్కొనకపోవడం గమనార్హం. మరోవైపు, సౌదీ అరేబియా కూడా ఇదే విధంగా స్పందించింది.అక్టోబరు 1వ తేదీన ఇరాన్ భారీ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. వీటిల్లో కొన్ని లక్ష్యాలకు అత్యంత సమీపంలో పడ్డాయి. మిగిలిన వాటిని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. దీనికి ప్రతీకార చర్య తప్పదని ఇజ్రాయెల్ ఇప్పటికే స్పష్టం చేసింది. తాజాగా ఆ దిశగా దాడులకు దిగింది. అదే సమయంలో ఇరాన్ మరోసారి దాడులు చేస్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఐడీఎఫ్ తీవ్ర హెచ్చరికలు చేసింది.

**ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు.. స్పందించిన ఇరాన్**

ఇరాన్ దాడులకు ప్రతీకారంగా ఆ దేశ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీనిపై తాజాగా ఇరాన్ స్పందించింది.తమ దేశ సైన్యానికి చెందిన మూడు సైనిక స్థావరాలను ఐడీఎఫ్ లక్ష్యంగా చేసుకుందని, ఈ దాడుల్లో పరిమిత స్థాయిలో మాత్రమే నష్టం వాటిల్లిందని వెల్లడించింది.ప్రభుత్వ మీడియాలో ఇరాన్ మిలిటరీ ఈమేరకు ప్రకటన చేసింది. తమ వైమానిక దళం ప్రతిస్పందన వల్లే నష్టం పరిమితమైందని తెలిపింది. అయితే ఘటనాస్థలాలకు సంబంధించిన దృశ్యాలను మాత్రం ప్రచారం చేయలేదు. ఇదిలా ఉంటే.. ఇజ్రాయెల్ చర్యలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందులో ఎలాంటి సందేహం లేదని ఇరాన్ హెచ్చరించినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా సంస్థ ఒకటి వెల్లడించింది.ఇదిలాఉంటే.. ఇరాన్ సైనిక స్థావరాలతో పాటు క్షిపణి తయారీకేంద్రాలపై ఐడీఎఫ్ దాడులు చేసింది. "ఈ క్షిపణులతో మా పౌరులకు తక్షణం ముప్పు పొంచిఉంది. అందుకే వాటిని ధ్వంసం చేశాం" అని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ప్రస్తుతానికి ఇరాన్‌పై తమ దాడులు ముగిసినట్లు వెల్లడించింది. "ఇరాన్ దాని మద్దతుదారులు అక్టోబరు 7 నుంచి ఇజ్రాయెల్‌పై కనికరం లేకుండా దాడులు చేస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని సార్వభౌమ దేశాల మాదిరిగానే ఇజ్రాయెల్‌కు ప్రతిస్పందించే హక్కు, బాధ్యత ఉంది. మా దేశాన్ని, ప్రజలను రక్షించుకునేందుకు ఏదైనా చేస్తాం" అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ పేర్కొన్నారు. అదే సమయంలో ఇరాన్ మరోసారి దాడులు చేస్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని సైన్యం తీవ్ర హెచ్చరికలు చేసింది.



## తనిఖీలు లేకుండానే మేడిగడ్డకి సబ్‌స్టాన్షియల్ పత్రం

**- కాళేశ్వరం కమిషన్ ముందు సిఈ సుధాకర్ రెడ్డి**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
కాళేశ్వరం కమిషన్ ముందు చీఫ్ ఇంజినీర్ (సీఈ) సుధాకర్‌రెడ్డి శనివారం విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల టెండర్లపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఆయన్ను విచారించింది. డీపీఆర్ తయారీ పనులను నామినేషన్ పద్ధతిన వ్యాప్కోస్‌కు అప్పగించినట్లు సుధాకర్‌రెడ్డి కమిషన్‌కు తెలిపారు. తనిఖీలు లేకుండానే మేడిగడ్డ బ్యారేజీకి సబ్‌స్టాన్షియల్ పత్రం ఇచ్చినట్లు అంగీకరించారు. డీపీఆర్ ప్రకారం కాఫర్ డ్యామ్‌కు డబ్బులు ఇచ్చినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ ఖరారు వేళ ఎల్‌అండ్‌టీ సంస్థని సంప్రదించినట్లు వివరించారు. విచారణ సందర్భంగా అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి ఎవరని కమిషన్ ప్రశ్నించింది. దీనికి సుధాకర్‌రెడ్డి.. హరీశ్‌రావు అని సమాధానమిచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఎలాంటి ఆదాయం లేదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. వరద వేగాన్ని అంచనా వేయకపోవడం వల్లే బ్లాకులు దెబ్బతిన్నాయని కమిషన్‌కు వివరించారు.

## దాడులను ఖండించిన సౌదీ అరేబియా



రియాద్ (ప్రజా మంటలు):
పతీకార దాడులను సౌదీ అరేబియా ఖండించింది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు మరింత తీవ్రతరం కావడంపై ఆందోళన వ్యక్తంచేసింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. 'ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా ఖండిస్తుంది. మధ్యప్రాచ్యంలో భద్రత, దేశాలు, ప్రజల స్థిరత్వాన్ని బెదిరిస్తూ ఆ ప్రాంతాల్లో ఘర్షణలు తీవ్రతరం కావడాన్ని ఆమోదించం' అని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది.ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేసిన ప్రతీకార దాడులపై బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ స్పందించారు. 'ఇరాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. ప్రాంతీయ తీవ్రతను నివారించాలి, అన్ని వర్గాలు సంయమనం పాటించాలి. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులపై ఇరాన్ స్పందించకూడదు' అని స్టార్మర్ పేర్కొన్నారు.అక్టోబరు 1వ తేదీన ఇరాన్ భారీ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. వీటిల్లో కొన్ని లక్ష్యాలకు అత్యంత సమీపంలో పడ్డాయి. మిగిలినవాటిని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. దీనికి ప్రతీకార చర్య తప్పదని టెల్ అవీవ్ స్పష్టంచేసిన విషయం తెలిసిందే. టెహ్రాన్‌పై దాడులకు ఇజ్రాయెల్ సైన్యాన్ని సిద్ధం చేసిందనే వార్తలు ఆందోళనను రేకెత్తించాయి. ఈనేపథ్యంలోనే ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేయడం గమనార్హం.



## తెలంగాణలో ఎక్కడా మంచినీటి సమస్య రావద్దు

**స్వచ్ఛమైన మంచి నీటినే సరఫరా చేయండి**

**మిషన్ భగీరథ నిర్వహణలో లోపాలు రాకూడదు**

**అధికారులతో సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశాలు**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్య రానీయ కూడదని మంత్రి సీతక్క ఆదేశించారు. శుద్ధి చేసిన నీరే సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. కోట్లాదిమంది ప్రాణాలు మిషన్ భగీరథ సిబ్బంది చేతిలో ఉన్నాయని.. అందుకే అధికారులు అంతా బాధ్యతతో పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వేసవికాలంలో నీటి ఎద్దడి ఉన్నా ఎలాంటి సమస్య లేకుండా తాగునీటిని అందించామని స్పష్టం చేశారు. 13456 మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాల వారీగా అధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా గ్రామీణ మంచి నీటి సరఫరా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, తదితరులు
హాజరయ్యారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... రిజర్వాయర్లలో సరిపోయినంత నీటి నిల్వలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లోకల్ సోర్స్‌ల మీద దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఐదు, ఆరు నియోజకవర్గాలను ఒక యూనిట్‌గా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వస్తున్నా ప్రజలు బోర్లు వేయించాలని, ఆర్వో ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మిషన్ భగీరథపై వేల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత బోర్ల మీద, ఆర్వో ప్లాంట్ల మీద ప్రజలు డిపెండ్ అవుతున్నారని అన్నారు. ఆ విధానం పోయేలా మిషన్ భగీరథ సిబ్బంది పని చేయాలి. మిషన్ భగీరథ నీళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలి. ప్రతి గృహానికి నల్లా నీరు అందేలా చర్యలు చేపట్టాలి. మిషన్ భగీరథ ట్యాంకులను తరచూ శుభ్ర పరచాలి. మిషన్ భాగీరథ పైప్ లైన్ల లీకేజీని అరికట్టాలి. తాగునీటి సరఫరాపై అన్ని గ్రామాల నుంచి నెలవారీగా నివేదికలు తెప్పించండి.నీటి సరఫరాలో సమస్య తలెత్తుతున్న ఉట్నూర్ వంటి ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని డిప్యూట్ చేయండి. క్షేత్రస్థాయిలో ఏ చిన్న సమస్య తలెత్తినా పై అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఏ నెలలో ఏ పని చేయాలో క్యాలెండర్‌ను రూపొందించు కోవాలి. ప్రతి ఏఈ చేతిలో యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలి. ఆయా గ్రామాల్లో ఏదన్నా సమస్యతో మిషన్ భగీరథ నీరు రాకపోతే ప్రత్యామ్నాయం చేసుకోవాలి. మోటు పాట్లు సవరించుకొని పనితనాన్ని మెరుగుపరుచు కోవాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## క్రిప్టోలతో ముప్పే..

**- ఆర్థిక స్థిరత్వంపై పెనుప్రభావం**

**- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
క్రిప్టో కరెన్సీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తంచేశారు. క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందన్నారు. 'పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరైన ఆయన క్రిప్టోల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం పొంచిఉందని దాస్ అన్నారు. దీనికారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉందన్నారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించకూడదని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. అందుకే క్రిప్టోను ప్రమాదకరంగా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాలను దృష్టిలోఉంచుకొని ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇది ప్రధాన ఆందోళన అని దాస్ తెలిపారు.క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని దాస్ పేర్కొన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే అంశంపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తుకుతెచ్చారు. క్రిప్టోపై ఆందోళన వ్యక్తంచేసిన మొదటి సెంట్రల్ బ్యాంకుల్లో తమ బ్యాంకు కూడా ఒకటన్నారు. "ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుంది. ఇది ద్రవ్య వ్యవస్థలో అస్థిరతకు దారితీస్తుంది. అంతేకాదు ఆర్థికరంగంపై ప్రభావం చూపుతుంది" అని ఆయన అన్నారు. అందుకే ఈవిషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

## బీజేపీ నన్ను జైల్లోనే చంపేందుకు కుట్రపన్నింది

**- కేజ్రీవాల్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఈరోజు ఢిల్లీలోని జహంగీర్‌పురిలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నిన్న నేను ఢిల్లీలోని వికాస్‌పురికి వెళ్లానని, అక్కడ బీజేపీ..గూండాలను పంపి నన్ను చంపేందుకు ప్రయత్నించింది. నాపై దాడి చేశారు. మీకు ధైర్యం ఉంటే ఎన్నికల్లో పోటీ చేయండి. నన్ను జైలుకు పంపి నా పని అక్కడే ఖతం చేయాలని చూశారు. గత 75 ఏళ్లలో ఏ పార్టీ, ఏ నాయకుడు చేయని పనిని నేను గత పదేళ్లలో నేను చేశాను. నిజాయితీతో పని చేస్తున్నాను. 2014లో 7-8 గంటలపాటు కరెంటు కోతలు ఉండేవి. కానీ ఇప్పుడు కరెంటు కోత లేదు. 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉంది. ఏ రాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదు. ఉచిత రేవూరి పంపిణీ చేస్తున్నారని బీజేపీ వాళ్లు నన్ను దుర్భాషలాడుతున్నారు. బీజేపీ తప్పుడు కేసులో నన్ను జైలుకు పంపింది. మళ్లీ నన్ను సీఎం చేయండి." అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పై శుక్రవారం దాడికి ప్రయత్నించారు. కేజ్రీవాల్ పాదయాత్ర చేస్తున్న సమయంలో వికాస్‌పురిలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'కొందరు బీజేపీ గూండాలు తమపై దాడికి ప్రయత్నించారు' అని ఆప్ చెబుతోంది. 'బీజేపీ గూండాలు కేజ్రీవాల్ దగ్గరికి వచ్చారని, పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదని' ఆప్ ఆరోపించింది. ఈ ఘటనను పార్టీ సీరియస్‌గా తీసుకుని పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ మంత్రి సౌరభ్ భరద్వాజ్ సోషల్ మీడియా ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. ఈడీ, సీబీఐ, జైలుతో కేజ్రీవాల్‌ను అణిచివేయాలని ప్రయత్నించగా.. ఫలించలేదని.. దీంతో బీజేపీ ప్రజలు అరవింద్ కేజ్రీవాల్ జీపై దాడికి యత్నించిందని ఆరోపించారు. కేజ్రీవాల్‌కి ఏదైనా జరిగితే దానికి నేరుగా బీజేపీయే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## అమయ్ కుమార్‌పై ఫిర్యాదులు వెల్లువ

**- ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్న బాధితులు..**



హైదరాబాద్, (ప్రజా మంటలు):
సీనియర్ ఐఏస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఈడీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని, 200 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేశారని, రాత్రికి రాత్రే పత్రాలు సృష్టించారని వాపోయారు. 40 ఏళ్లుగా పొజిషన్‌లో ఉన్నా.. పోలీసు బలగాలతో వెళ్లగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు."సర్వే నెంబరు 111 నుంచి 179 వరకు 460 ఎకరాల భూమి ఉంది. శంకర్‌హిల్స్‌లో సుమారు 3,300 మంది ప్లాట్ ఓనర్స్ ఉన్నారు. నిందితులు దాదాపు రూ.30వేల కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. మాకు జరిగిన అన్యాయంపై ఈడీకి ఫిర్యాదు చేశాం. ఐఏఎస్ అమోయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పెద్దల పాత్రపై దర్యాప్తు జరపాలి" అని బాధితులు ఈడీ అధికారులను కోరారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com